నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: చందానగర్ సెక్షన్.. హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, ప్రకాష్‌నగర్, వినాయక నగర్ ఏరియాలలో..
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు ప్రకాష్‌నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

నేడు ఆలయ వార్షికోత్సవం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం శనివారం జరగనుంది. వేడుకల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ సహిత ప్రధాన దేవత ఆవాహనం, అభిషేకం, హోమం, కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ ఫేజ్ 3 కాలనీలో నిత్యం కరెంట్ ట్రిప్ అవుతుందని శుక్రవారం కాలనీవాసులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన ఎలక్ట్రికల్ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యతో ఎలక్ట్రికల్ సామానులు కాలిపోతున్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని సమస్య త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, భాగ్యనగర్ ఎలక్ట్రికల్ సెక్షన్ ఏఈ దయానంద్, లైన్‌మెన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందుకున్న సులోచన, యోగేశ్వరి దేవి, కృష్ణవేణి, శారద, అనితాబాయి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఏ బ్లాక్ మహిళా కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. వైస్ ప్రెసిడెంట్‌గా సులోచన, జనరల్ సెక్రటరీలుగా యోగేశ్వరిదేవి, కృష్ణవేణి, జాయింట్ సెక్రటరీలు శారద, అనితా బాయిలకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ అరుణ, రమాదేవి, నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ తస్వీర్ బేగం , సెక్రటరీ కృష్ణ కుమారి, వల్లి పాల్గొన్నారు.

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ×సండే ఈవినింగ్ టాక్‌‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ×హౌ టు మేక్ ఫుడ్ యాస్ మెడిసిన్ టు రివర్స్ డిసీజెస్‌‌అనే అంశంపై ముంబాయికి చెందిన అంబా గోపాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ హరీష్‌శెట్టి ఉపన్యాసం ఇస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలి.

ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 7వ ఫేజులో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీసీ సెంట్రల్ కమిటీ సెక్రటరీ కరుణాకర్‌నాయుడు, పుష్పరెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవరావు, మేకల మైఖేల్, సంధ్య, పొన్నం రజిత పాల్గొన్నారు.

నీరు బ్యాంక్ బ్యాలెన్స్‌లాంటిది..
పొదుపుగా వాడుకోవాలి



నీటి వృథాను తగ్గిస్తే రేపటి తరానికి మేలు



'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వర రావు

రాయదుర్గం: నీటి వృథాను తగ్గిస్తే రేపటి తరానికి మేలు చేసిన వారమవుతామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన నీటి ప్రాధాన్యత గురించి శుక్రవారం వివరించారు. నీరు బ్యాంక్ బ్యాలెన్స్‌లాంటిదని డబ్బులు పొదుపుగా వాడుకున్నట్లే నీటిని కూడా పొదుపుగా వాడాలని అభిప్రాయపడ్డారు.1992లో రియోడిజనెరియాలో జరిగిన ఐక్యరాజ్యసమితి సదస్సులో నీటి ఆవశ్యకతపై చర్చ జరిగిందని, అప్పటికే చాలా దేశాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయని గుర్తుచేశారు. నీటి ఆవశ్యకతను గుర్తు చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతియేటా మార్చి22 న 'ప్రపంచ నీటి దినోత్సవాన్ని చేసుకోవడం మొదలైందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రశ్న: నీటి ప్రాధాన్యత గురించి వివరించండి..?

జ: మనిషి శరీరానికి నీరు ఎంతో అవసరం. ఆహారం లేకుండా మనిషి కొన్ని గంటలపాటు బతికివుంటాడేమో కానీ నీరు లేకుండా ఉండలేరు . మన శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, జలవిద్యుత్ ఉత్పత్తితో పాటుగా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం కోసం నీరు ఎంతో ముఖ్యం.

ప్ర: హైదరాబాద్‌లో నీటి వృథా గురించి..?

జ: నగరంలో నీటి వృథా ఎక్కువగా ఉంది. వరంగల్ లేదా కరీంనగర్ లాంటి పట్టణాలకు ఒక్క రోజు సరిపోయేంత నీరు హైదరాబాద్‌లో వృథా అవుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం , స్వచ్ఛంద సంస్థల ద్వారా నీటి వాడకంపై అవగాహన కల్పించాలి. వాహనాలు, వాకిళ్ళు కడగటం, డ్రమ్ముల కొద్దీ నీళ్ళు పారబోయడం తగ్గించాలి. నీటిని సృష్టించ లేము. కాబట్టి ఉన్న వనరును పరిరక్షించాలని అందరూ గుర్తించాలి.

ప్ర: ప్రపంచ నీటి దినోత్సవం గురించి చెప్పండి

జ: ప్రపంచంలో అత్యంత స్వచ్ఛమైన నీరు కేవలం మంచు పర్వతాల్లో దాగి ఉన్నాయి . కాబట్టి వాటిని పరిరక్షించుకోవాలి. ప్రపంచ నీటి దినోత్సవం-2025 థీమ్ 'గ్లేసియర్ ప్రిజర్వేషన్' ద్వారా ప్రపంచానికి ఐక్యరాజ్యసమితి ఓ హెచ్చరికను జారీ చేసింది. శతాబ్దాలుగా మంచుతో కప్పబడిన ఈ మహాపర్వతాలను, మంచుఖండాలను కూడా కాపాడుకొంటేనే రేపటి తరానికి భవిష్యత్తు ఉంటుంది. ప్రపంచంలో అతి పెద్ద గ్లేసియర్‌గా గ్రీన్‌ల్యాండ్, అంటార్కిటికా, భారత సరిహద్దుల్లో ఉన్న సియాచిన్, గంగోత్రి మంచు పర్వతాలు, నార్త్ అమెరికా తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. హిమాలయాల్లో మంచు పర్వతాలను రక్షించుకుంటే గానీ రేపటి తరానికి నీరు అందుతుందని ప్రజలు తెలుసుకోవాలి.

ప్ర: హిమనదులు కరిగిపోయే ప్రమాదం ఉందా..?

జ: ప్రపంచంలోని రెండు మూడొంతలు హిమనదులు కరిగి పోయే అవకాశం ఉంది. భవిష్యత్తులో నీటి కోసం అలమటించకుండా ఉండాలంటే మంచు పర్వతాలను రక్షించుకోవాలి. కాలుష్యాన్ని తగ్గించుకుంటే ఇవి బాగుంటాయి. వేడి ఎక్కువయితే ఈ పర్వతాలు క్రమంగా కరిగిపోతుంటాయి. భూతాపం తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.తగు చర్యలు తీసుకోవాలి.

ప్ర: నీటి సమస్య ఎదురైన ప్రాంతాలు ఏవి?

జ: ప్రపంచ దేశాలలోనూ నేడు తీవ్ర నీటి కొరత ఏర్పడుతోంది. దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో కొన్నేళ్ల పాటు నీటిని రేషన్ పద్ధతిలో ఇచ్చారు. ఓ కుటుంబం రోజుకు 5 లీటర్ల చొప్పున వాడుకోవాలి. అలాగే చెన్నయ్‌లో రెండేళ్ల కిందట, బెంగళూరులో గత ఏడాది ఇదే పరిస్థితి వచ్చింది. గతంలో మహారాష్ట్రలోని లాతూర్‌కు రైలు వ్యాగన్లలో నీళ్ళు వచ్చేవి. ఇప్పటికీ రాజస్థాన్, గుజరాత్, బిహార్ రాష్ట్రాల్లో నీటి కొరత తీవ్రంగా ఉంది ప్రజలు ఆలోచించాలి. ఇంకుడుగుంతల ఏర్పాటు, వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చూడాలి. నీటిని పొదుపుగా వాడుకుంటే సమస్యలు తలెత్తవు. ఆ దిశగా చర్యలు అవసరం.

కొండాపూర్ ఆస్పత్రిలో స్వచ్ఛభారత్ అభియాన్



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డా. విజయలక్ష్మి , డా.అనురాగిణి రెడ్డి, వైద్యబృందం

రాయదుర్గం: కొండాపూర్‌లోని జిల్లాస్థాయి ఆస్పత్రిలో శుక్రవారం స్వచ్ఛభారత్ అభియాన్ (కాయకల్ప అసెస్‌మెంట్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో శుభ్రమైన వాతావరణం ఉండేలా చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. శుభ్రతతో ఇన్‌ఫెక్షన్స్‌ను నియంత్రించవచ్చన్నారు. అందుకోసం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణి రెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, వైద్య బృందం పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన కామారెడ్డి డీసీహెచ్‌ఎస్

కొండాపూర్‌లోని జిల్లా స్థాయి ఆస్పత్రిని కామారెడ్డి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య బృందం సందర్శించింది. ఆస్పత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పరిసరాల శుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. అంతకుముందు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణిరెడ్డి, వైద్య బృందంతో సమావేశమయ్యారు.

ఇంకుడు గుంతల ఏర్పాటు ఆవశ్యం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చందానగర్: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం హఫీజ్‌పేట్ 15వ డివిజన్ జలమండలి జనరల్ మేనేజర్ బ్రిజేష్‌తో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం మార్చి 22న ప్రపంచ జలదినోత్సవంగా ప్రకటించి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రకృతి ప్రసాదించిన నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి సంవత్సరం ఒక నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నినాదం 'హిమనదాల సంరక్షణ' అని అన్నారు. భవిష్యత్తులో అందరికీ శుభ్రమైన నీరు, సాగునీరు తదితర అవసరాలకు కావాలంటే నీటిని పొదుపుగా వాడడం, వాడిన నీటిని తిరిగి వ్యవసాయానికి ఉపయోగించుకోవడంతో పాటు, వ్యర్థాలను భూమిలోకి ఇంకకుండా చూడాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలు పెంచుదామన్నారు. అనంతరం అందరితోను నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీహరిబాబు, కౌండిన్యశ్రీ, నండూరి వెంకటేశ్వరరాజు, పాలెం శ్రీను, జనార్దన్, బాలరాజు, సుధాకర్, యూసుఫ్, రామారావు, శివరామిరెడ్డి, జలమండలి అధికారులు నరేందర్‌రెడ్డి, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే గాంధీ
- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో రూ.8.08 కోట్ల వ్యయంతో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో రూ.8.08 కోట్ల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్లు రాగంనాగేందర్‌యాదవ్, హమీద్ పటేల్, గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియను ప్రారంభించామన్నారు. అలాగే 64 చెరువులను దశలవారీగా సుందరీకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు ,కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దారిదోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

10 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఐ రమేష్ నాయుడు

మియాపూర్: రాత్రి పూట బైక్‌పై ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులను అడ్డుకుని దాడి చేయడంతో పాటు వారి వద్దనున్న డబ్బులు, మొబైల్ ఫోన్లను లాక్కుని వెళ్తున్నా ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం....మెదక్ రేగోడు మండలం లింగంపల్లికి చెందిన బి. ఆగమయ్య(19) కూకట్‌పల్లిలో ఉంటున్నాడు. అతని స్నేహితుడైన జగద్గిరిగుట్టకు చెందిన బాసోడి అభిషేక్(25) ఇద్దరు కలిసి గత కొన్ని నెలల నుండి రాత్రి సమయాల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బిహార్‌కు చెందిన ఎండీ. జావీద్ జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌లోని ఓ హోటల్‌లో ఆహారం తీసుకుని డెలివరీ నిమిత్తం బయల్దేరాడు. సమీపంలో యూటర్న్ చేస్తుండగా ఆగమయ్య, అభిషేక్‌లు ఇరువురు జావీద్‌ను అడ్డుకున్నారు. గంజాయి డెలివరీ చేస్తున్నావని బెదిరించి హెల్మెట్‌తో దాడి చేశారు. ఒకరు అతని వాహనం తీసుకుని కొండాపూర్ వైపు తీసుకువెళ్లి జావీద్ వద్ద నుండి రూ.5వేలు, రెండు సెల్‌ఫోన్లను లాక్కున్నారు. ఫోన్ పే పాస్వర్డ్, బైక్ కీలను తీసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి కొండాపూర్‌లోని నిర్మానుష్య ప్రాంతంలో వదిలేసి వెళ్లిపోయారు. జావిద్ భయంతో స్వంత ఊరుకు వెళ్లిపోయాడు. అనంతరం జావిద్ కనిపించడం లేదంటూ జావిద్ సోదరుడు తల్హా మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు చేశారు. దీంతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నారు. వారం రోజుల తర్వాత దావిద్ స్వంత ఊరు నుండి ఫోన్ చేసి తన సోదరుడు తల్హాకు జరిగిన విషయం తెలిపాడు. దీంతో మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా కొండాపూర్ ఏఎంబీ మాల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఆమగయ్య, అభిషేక్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఇదే తరహాలో గత నెల రోజులుగా గచ్చిబౌలి, జుబ్లీహిల్స్, మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదై ఉన్నాయి. గచ్చిబౌలి, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఆగమయ్య, అభిషేక్‌లను అరెస్ట్ చేసి వారి వద్దనుండి 10 మొబైల్ ఫోన్లు, ఓ గోల్డ్ రింగ్ ,యాక్సెస్ స్కూటీని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయమని మియాపూర్ క్రైమ్ డీఐ రమేష్ నాయుడు, సిబ్బంది ప్రేమ్ కుమార్, పుల్యానాయక్, చంద్రబోస్, పూర్ణచందర్, జగన్, సాయిలను మాదాపూర్ డీసీపీ వినీత్, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావులు అభినందించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

అమీన్‌పూర్ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అమీన్‌పూర్ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్-630 లో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌ను జేసీబీతో తొలగించారు. అదేవిధంగా సర్వే నంబర్- 993లో నిర్మించిన పది రేకుల షెడ్లను తొలగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా, నలుగురికి రూ.1500, అదేవిధంగా ఐదుగురికి జరిమానాలతో పాటు ముగ్గురికి రెండు రోజులు, ఇద్దరికి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

మూసాపేట: మూసాపేటలోని మహంకాళి, సరస్వతి ఆలయం 10వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, కుంకుమార్చనలు, హోమం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

డబుల్ ఇళ్ల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నివాసితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ కేసీఆర్‌నగర్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తన దృష్టికి తీసుకొని వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధ తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య



మియాపూర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మయూరినగర్‌లో ఎర్రవెల్లి నరేందర్(38) భార్య మమత, కూతురితో కలిసి నివాసముంటున్నారు. 4 నెలల కిందట బాచుపల్లిలో రేణు కిచెన్ హోటల్‌ను ప్రారంభించారు. హోటల్ సరిగా నడవకపోవడంతో అప్పులు చేశాడు. పది రోజుల కిందట భార్య మమత, కూతురుతో కలిసి బాచుపల్లిలో ఉంటున్న వారి అమ్మవారి ఇంటికి వెళ్లింది. పది రోజుల నుండి నరేందర్ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలకు నరేందర్ భార్య మమతకు ఫోన్ చేసి అప్పులు బాధ భరించలేకపోతున్నానని చెప్పాడు. దీంతో మమత మల్కాజిగిరిలో ఉంటున్న మామ సిద్ధయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో సిద్ధయ్య నాలుగు గంటల సమయంలో వచ్చిచూడగా హాల్‌లో చున్నీతో నరేందర్ ఉరివేసుకుని కనిపించాడు. పరిశీలించగా అప్పటికే నరేందర్ మృతి చెంది ఉన్నాడు. వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.. అప్పుల బాధ భరించలేక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి సిద్దయ్య మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ, రోడ్డు నంబర్ 4లోని కేకే రెడ్డి హస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. మధుమేహ గ్రస్తులు, ఫ్యాటీ లివర్, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఊబకాయం వంటి సమస్యలకు చికిత్స అందించనున్నారు. లివర్ గురించి తెలుసుకునేందుకు 5 వేల విలువ చేసే అత్యాధునిక ఫైబ్రోస్కాన్ లివర్ డ్యామేజ్‌ను పసిగట్టే స్కానింగ్ పరీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు డా. అనుషా కంతేటి, డా. ఎం. మనీషా, డా. ఐ.ధనలక్ష్మిల పర్యవేక్షణలో చికిత్స అందించనున్నారు. అదేవిధంగా ఈసీజీ, పీఎఫ్‌టీ, ఆర్‌బీఎస్, యూరిక్ యాసిడ్, ఫైబ్రో స్కాన్‌లను చేయనున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

'నిథమ్'లో 'నిథ్మాతిథ్యం' ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నిథమ్‌లో 'నిథ్మాతిథ్యం' కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇంటర్ కాలేజ్ సాంస్కృతిక, క్రీడా పోటీలలో నిథమ్ విద్యార్థులే కాకుండా నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమాన్ని నిథమ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంకె గణేష్ ప్రారంభించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ విజయలక్ష్మీ, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధుల పర్యవేక్షణలో పోటీలు సాగాయి. మొదటి రోజు కుకింగ్, క్విజ్, ఫొటోగ్రఫీ, రీల్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ జెండగె హన్మంతు కొండిబా, చెఫ్‌లు మహేష్, తుల్జారామ్, వివేక్ ఠాకూర్, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



చెస్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



వంటల పోటీల్లో..

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



శేరిలింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు



మియాపూర్ శారద విద్యామందిర్ స్కూల్‌లో హాల్ నంబర్‌ను చూస్తున్న విద్యార్థినులు

శేరిలింగంపల్లి/మియాపూర్: పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను ఉదయం 30 నిమిషాల ముందు నుంచే అనుమతించారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 6,090 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మండల విద్యాధికారి వెంకటయ్య కేంద్రాలను పర్యవేక్షించారు.

పటాన్‌చెరు పరిధిలో 14..
అమీన్‌పూర్ పరిధిలో 6 పరీక్షా కేంద్రాలు

పటాన్‌చెరు టౌన్: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పటాన్‌చెరు పరిధిలో 14 పరీక్షా కేంద్రాలు, అమీన్‌పూర్‌లో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పటాన్‌చెరు పరిధిలో 14 పరీక్షా కేంద్రాల్లో 2,980 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పటాన్‌చెరు ఎంఈఓ రాజేశ్వరరావు నాయక్ తెలిపారు. అదే విధంగా అమీన్‌పూర్ పరిధిలోని ఆరు పరీక్ష కేంద్రాలలో 1,270 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని అమీన్‌పూర్ ఎంఈఓ సుధాకర్ తెలిపారు.



పటాన్‌చెరులో విద్యార్థుల హాల్‌టికెట్‌లను చెక్ చేస్తున్న అధికారులు